'పేదలంటే ఎందుకంత ద్వేషం బాబూ'

- కన్నింగ్ నేతల కల్లబొల్లి మాటలు నమ్మొద్దు
- మంచి చేసి ఉంటేనే ఓటేయండి
- జగనన్న సురక్ష ద్వారా గంటల్లోనే సమస్యల పరిష్కారం
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



బండిఆత్మకూరులో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, తెలుగు తమ్ముళ్లకు పేదలంటే అంత ద్వేషం ఎందుకని, కరోనా సమయంలో టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యే ఎక్కడున్నారంటూ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రశ్నించారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి వచ్చిన ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అక్కా, అన్నా అంటూ కపటప్రేమ చూపే కన్నింగ్ నేతలు వస్తారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్షతో గంటల వ్యవధిలోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని చెప్పారు. బండిఆత్మకూరులో నలభై ఏళ్ల నుంచి ఉన్న సమస్య పరిష్కారం కోసం రూ.కోటి మంజూరు చేయించానని గుర్తు చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన పలువురు దర్గాకు వెళ్తూ మృత్యువాతపడ్డారని, క్షతగాత్రులైన కుటుంబాలకు అండగా నిలిచానన్నారు. నేను మంచి చేశానంటేనే ఓటేయండి, లేదంటే వద్దంటూ సభాముఖంగా కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సంజీవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు బారెడ్డి రామతులశమ్మ, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఎస్డీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, వైస్ ఎంపీపీలు రాగాల రమణ, మధురాణి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, ఎంపీటీసీ పుల్లయ్య, బాబురెడ్డి, సుజాతమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు భాగస్వాములవ్వాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బండిఆత్మకూరు పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ సంధ్య, ఏపీఓ వసుధ తదితరులు పాల్గొన్నారు.



కొణిదేల గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

'జగనన్న సురక్ష'తో అందరికీ మేలు

నందికొట్కూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలందరికీ మేలు జరుగుతుందని ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ కలిమున్నిసా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో అధికారులు సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. అనంతరం దరఖాస్తుదారులకు గ్రామ సర్పంచ్ నవీన్‌తో కలిసి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీఓ శోభారాణి పాల్గొన్నారు.

'మణిపూర్' ఘటనలకు నిరసనగా శాంతి ర్యాలీ



వెలుగోడులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

వెలుగోడు: మణిపూర్ హింసాత్మక ఘటనలకు నిరసనగా పట్టణంలో వెలుగోడు క్రైస్తవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలతో దేశం సిగ్గుతో తల దించుకుంటోందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన మత స్వాతంత్రపు హక్కును కాలరాస్తూ కొన్ని రాయకీయ శక్తులు దేశం మొత్తంగా పని చేస్తున్నాయని ఆరోపించారు. మణిపూర్ నేరస్తులను వెంటనే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం క్రైస్తవుల హక్కులను కాపాడాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ వేల్పుల జయపాల్, లిటిల్ ఏంజిల్స్ స్కూల్ కరస్పాండెంట్ ఇమ్మానుయేలు, సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ మేకల రాజేంద్రబాబు, సెక్రటరీ ఏర్వ శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతిని పరిరక్షించాలి



గువ్వలకుంట్ల రోడ్డు వెంట మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ మేరి అధికారులు

కొత్తపల్లి: ప్రకృతిని పరిరక్షించడం మనందరి బాధ్యత అని ఎంపీడీఓ మేరి సూచించారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గువ్వలకుంట్ల గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో, రోడ్డు వెంట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ నడుబిగించాలన్నారు. మొక్కలే ప్రాణకోటికి జీవనాధారం అన్నారు. మొక్కలు పెంచడం ద్వారా వర్షాలు సకాలంలో కురుస్తాయని తద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రేష్మ, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, ఎంపీటీసీ సోమల స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

13లోగా సర్వే పూర్తి చేయాలి

పగిడ్యాల: 18 ఏళ్లలోపు వయసు కలిగిన పిల్లలందరూ బడిలో ఉండాలన్న ఆశయంతో నిర్వహిస్తున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే (జీఈఆర్)ను ఆగస్టు 13వ తేదీలోగా పూర్తి చేయాలని మండల విద్యాధికారి సుభాన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో ఎల్లో బ్యాడ్జ్ సాధించిన గ్రామ వలంటీర్లకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. జీఈఆర్ సర్వేను వంద శాతం పూర్తి చేసిన వలంటీర్లు శివశంకర్, రాజేశ్వరికి ఎల్లో బ్యాడ్జ్ రావడం అభినందనీయమన్నారు. మండలవ్యాప్తంగా 13 మంది వలంటీర్లు ఎల్లో బ్యాడ్జ్‌కు చేరువలో ఉన్నారని జీఈఆర్ సర్వేను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 5 వేల మంది పిల్లలు ఉన్నారని, ఇప్పటివరకు 4 వేల మందికి పైగా పిల్లలను సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఎల్లో బ్యాడ్జ్ సాధించిన ఇద్దరు వలంటీర్లకు ఎంఈఓలు షీల్డ్‌లు అందజేసి సన్మానించారు. ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

సర్కారు బడుల్లో డిజిటల్ పాఠాలు

జూపాడుబంగ్లా: త్వరలో విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన చేయనున్నట్లు ఎంఈఓ మద్దిలేటి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ విద్యాబోధనలో భాగంగా ఇప్పటిదాకా ఏడు పాఠశాలలకు 36 మానిటర్లు మంజూరైనట్లు చెప్పారు. జూపాడు బంగ్లా మోడల్ స్కూల్, కస్తూర్బా, గురుకులం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ పాఠశాల, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలకుగాను ఒక్కోటి రూ.1.20 లక్షల విలువైన 65 ఇంచుల మానిటర్లు మంజూరైనట్లు వివరించారు. వాటిని ఆయా పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వాటికి ఇంటర్నెట్ కనెక్షన్ మంజూరుకాగానే డిజిటల్ తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. డిజిటల్ విద్యాబోధన వల్ల విద్యార్థుల్లో విద్యాభ్యాసంపై ఆసక్తి పెరగడంతో పాటు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలిగే సామర్థ్యం పెరుగుతుందన్నారు.

శ్రావణమాసం పర్వదినాల్లో ఆర్జిత అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈఓ ఎస్.లవన్న తెలిపారు. శ్రావణమాసం సెలవు రోజుల్లో శ్రీశైలం ఆనకట్ట గేట్లు తెరిచే అవకాశం ఉండటంతో భక్తులరద్దీ అధికంగా ఉండనుంది. ఈ నేపథ్యంలో స్వామివారి గర్భాలయ ఆర్జిత అభిషేకం, సామూహిక ఆర్జిత అభిషేకం టిక్కెట్లు నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు స్వామివారి స్పర్శదర్శనం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో పొందాలన్నారు. ఆగస్టు నెల టిక్కెట్ల కోటాను ఇప్పటికే దేవస్థానం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. అలాగే సెప్టెంబర్ నెల టిక్కెట్ల కోటాను ఆగస్టు 25 నుంచి ఆన్‌లైన్‌లో ఉంచుతామన్నారు.

అభిషేకాలు నిలుపుదల చేసిన రోజులు

ఆగస్టు 12, 13, 19, 20, 26 , 27, సెప్టెంబర్ 2, 3, 9, 10వ తేదీలు శని, ఆదివారం వారాంతపు రోజులు కావడంతో స్వామివారి గర్భాలయ ఆర్జిత అభిషేకం, సామూహిక ఆర్జిత అభిషేకం టిక్కెట్లు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 14, 21, 28, సెప్టెంబర్ 4 ,11వ తేదీల్లో సోమవారం కావడంతో.. ఆగస్టు 15వ తేదిన స్వాతంత్ర్యం దినోత్సవం, 31 వ తేదీన శ్రావణ పౌర్ణమి, సెప్టెంబర్ 6న కృష్ణాష్టమి సందర్భంగా ఆర్జిత అభిషేక టిక్కెట్లను నిలుపుదల చేశామన్నారు. పైన తెలిపిన రోజుల్లో కాకుండా మిగిలిన రోజుల్లో మధ్యాహ్నం 2 గంటలకు ఉచిత స్పర్శదర్శనం యథావిధిగా కొనసాగుతుందన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

మహానంది: పర్యావరణ పరిరక్షణద్వారానే మానవ మనుగడ సాధ్యమని ఎఫ్ఆర్ఓ నాసిర్‌ఝా, డీటీ హరిత అన్నారు. బండిఆత్మకూరు సమీపంలోని ప్రభాత్ విద్యాసంస్థల ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు అవ్వాలన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

మండల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపాలమ్మ

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యం అని ఆత్మకూరు ఎంపీపీ తిరుపాలమ్మ స్పష్టం చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలన్నారు. వడ్లరామాపురంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు పంటల సాగులో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. అంతకుముందు జెడ్పీటీసీ సభ్యుడు కురుకుంద శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, బ్లీచింగ్, సున్నం చల్లాలని చెప్పారు. విషజ్వరాలు ప్రబలకుండా వైద్యఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సౌకర్యార్థం అన్ని ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో ఉంచామని, అవసరం అయితే ఇంకా తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేపడుతున్నట్లు ఏపీఓ నాగమ్మ చెప్పారు. అన్ని గ్రామాల్లో పొదుపు మహిళలకు రుణాలు మంజూరు చేస్తామని ఏపీఎఫ్ ఉమాదేవి పేర్కొన్నారు. తహసీల్దార్ ఉమారాణి మాట్లాడుతూ.. రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ఎస్ఐ వెంకటనారాయణ రెడ్డి, ఎంపీటీసీలు రామకృష్ణారెడ్డి, అబ్దుల్‌కలాం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పైర్లను కాపాడుకోవాలి

కొత్తపల్లి: అధిక వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పైర్లు దెబ్బతినే అవకాశం ఉందని, జాగ్రత్తలు పాటించి పైర్లను సంరక్షించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ సూచించారు. శుక్రవారం మండలంలోని కొక్కెరంచ గ్రామంలో ఏఓ కె.మహేష్ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతుల పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షం తగ్గిన వెంటనే పంట దెబ్బతినకుండా ఎకరానికి 25 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ చల్లాలని సూచించారు. వ్యవసాయాధికారుల సూచనలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డు పొంది ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులకు అవసరమయ్యే ఎరువులను ఆర్‌బీకేలలో అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. వీఆర్వో వేణుగోపాల్, వీహెచ్ఏ అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

పాములపాడు: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ గోపీకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నాయని అప్రమత్తంగా ఉండి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయించాలన్నారు. క్లోరినేషన్ చేయించాలని సూచించారు. నీరు లీక్ అవుతున్న పైపులకు మరమ్మతులు చేయించాలన్నారు. బ్లీచింగ్, సోడియం, క్లోరైడ్, ఫినాయిల్ అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకావాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలపై తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని గ్రామ సచివాలయాల్లో తప్పనిసరిగా నిర్వహించాలని వివరించారు. ఈఓపీఆర్డీ శ్రీనివాసనాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జుబేర్, పంచాయతీకార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం కానీయొద్దు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో కుళాయిలకు సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుబ్రమణ్య శర్మ సూచించారు. శుక్రవారం ఆయన తరిగోపుల గ్రామంలో పర్యటించి తాగునీటి పథకాలను పరిశీలించారు. ట్యాంకు వద్ద అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన ఆయన వెంటనే ట్యాంకు చుట్టూ మురికి నీటిని తొలగించాలని కార్యదర్శి సామేలును ఆదేశించారు. అలాగే ప్రతి 15 రోజులకో పర్యాయం తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి, ఆ తేదీలను నమోదు చేయాలన్నారు. పైపులు లీకేజీ కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడైనా లీకేజీ అయితే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తూడిచెర్ల గ్రామంలో తాగునీటి పైపు లీకేజీ అయిన విషయం తన దృష్టికి వచ్చిందని వెంటనే మరమ్మతులు చేయించి నీరు కలుషితం కాకుండా చేయిస్తామని ఎంపీడీఓ తెలిపారు. అలాగే గ్రామాల్లో మురుగునీటి నిల్వలను శుభ్రం చేయించడంతో పాటు ప్రధాన రహదారుల వెంట చెత్తచెదారం లేకుండా గ్రీన్ అంబాసిడర్లతో శుభ్రం చేయించాలని ఆదేశించారు.



తరిగోపులలో తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



తాటిపాడులో అగ్నిగుండం తొక్కుతున్న పీర్లదేవుళ్లు



పీర్ల స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి పెద్దసరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని తాటిపాడు, తంగడంచ, మండ్లెం, జూపాడుబంగ్లా, 80 బన్నూరు, తర్తూరు తదితర గ్రామాల్లో కొలువుదీరిన పీర్ల దేవుళ్లకు పెద్దసరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి సమయంలో చిన్న హుసేనాళం, పెద్ద హుసేనాళం పీర్లను పూనకం పూనిన వ్యక్తులు ఎత్తుకొన్నారు. అనంతరం గ్రామంలోని దర్గా వద్ద ప్రత్యేక ఫతేహాలు నిర్వహించి భవిష్యవాణి వినిపించారు. ఆయా గ్రామాల్లోని పీర్లచావిడిల ముందు ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో పీర్లదేవుళ్లతో పాటు భక్తులు నడిచి భక్తిని చాటుకున్నారు. మండ్లెంలో కొలువుదీరిన పీర్లలో హుసేనాలం, మౌలాలి, ఇమాంఖాసీం పీర్లను ఎత్తారు. అనంతరం అగ్నిగుండం తొక్కారు. ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు శనివారం ఏటికి వెళ్తాయని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు భారీఎత్తున సంబరాలు జరుపుకోనున్నారు.

బీజేపీ పాలనలో దళితులపై దాడులు

నందికొట్కూరు: బీజేపీ పాలనలో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. మణిపూర్‌లో దళితులపై దాడులు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, అమానుష సంఘటనలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయన్నారు. ఇంత జరుగుతున్నా కేంద్రం, ఆ రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపకపోవడం దారుణమన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. మణిపూర్ సంఘటనలకు బీజేపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు పక్కిర్‌సాహెచ్, గోపాలకృష్ణ, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు వేల్పనూరుకు ఎమ్మెల్యే రాక

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శనివారం వేల్పనూరు గ్రామానికి వస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యుడు జనాభారెడ్డి తెలిపారు. గ్రామంలో నిర్వహించే 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని తెలిపారు. అలాగే జేఎల్‌జీ గ్రూపులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.1.20 కోట్ల రుణాలను అందజేస్తారని చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

నీటి సమస్య పరిష్కారం

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామం ఎస్సీ కాలనీలో సర్పంచ్ అఖ్తరున్నిసా నీటి సమస్యను పరిష్కరించారు. బుధవారం కాలనీలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు పైపులు తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో ట్యాంకుకు ఎక్కించే నీరంతా వృథా కావడంతో కాలనీలో నీటి సమస్య తలెత్తింది. విషయం సర్పంచుకు తెలియజేయగా తుప్పు పట్టిన రెండు పైపులకు వెల్డింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తాగు నీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు జబ్బార్ వెంట ఉన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

ఆత్మకూరు: స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడులు ఏసురత్నం పేర్కొన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛభారత్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. సీఐటీయూ నాయకులు రామ్‌నాయక్, స్వాములు, వెంకటరాముడు, లింగన్న, రవితేజ, సుధాకర్, రాముడు, దాసు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఫాగింగ్

ఆత్మకూరు: పట్టణంలోని 1వ వార్డుకు చెందిన కల్లావీధి మెయిన్‌బజార్ ప్రాంతాల్లో దోమల నివారణకు శుక్రవారం ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ కలిముల్లా మాట్లాడుతూ పట్టణంలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

హైవేకు భూసేకరణపై విచారణ



రైతులతో మాట్లాడుతున్న ఆర్‌డీఓ దాసు

మహానంది: నంద్యాల–కల్వకుర్తి జాతీయ రహదారి–167కే భూముల సేకరణ కోసం శుక్రవారం విచారణ చేపట్టారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె, బండిఆత్మకూరు గ్రామాల్లో ఆర్‌డీఓ దాసు, తహసీల్దార్ రవికుమార్, డీటీ హరిత ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. రైతుల పొలాలకు చెందిన పాసుపుస్తకాలు, అండగల్స్, టైటిల్ డీడ్ తదితర వివరాలను పరిశీలించారు. ఏ.కోడూరు, బి.కోడూరు, పార్నపల్లె, పెద్ద దేవళాపురం, బండిఆత్మకూరు గ్రామాలకు చెందిన రైతులు అధికారుల వద్దకు చేరుకుని సమస్యలను తెలిపారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు వినతిపత్రాలు అందించారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు కాశీరామ్, శ్రీనివాసులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఫీ'జులుం' నియంత్రించాలి

నందికొట్కూరు: విద్యాశాఖ నిబంధనలు తుంగలో తొక్కి ఫీజుల పేరుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బంద్ ప్రశాంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడం తగదన్నారు. అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరారు. ఏబీవీపీ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరినాథ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



దామగట్లలో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో రూ. 20 లక్షల 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగనన్న పాలనలో నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. సింగిల్ విండో చైర్మన్లు హరిసర్వోత్తమ రెడ్డి, నగినేల వృశేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరం రత్నం, వేల్పుల నాగన్న, సంజన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువుకు మరోసారి గండి

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామంలో ఉన్న ఈర్ల చెరువుకు ఒకే వారంలో రెండు సార్లు గండి పడింది. గత వారం అధిక వర్షాల కారణంగా ఈర్ల చెరువుకు ఈనెల 24వ తేదీన గండి పడింది. మంగళ, బుధ, గురువారాలలో నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన వర్షాలకు శుక్రవారం చెరువుకు అధికంగా వరద నీరు చేరింది. దీంతో మళ్లీ గండి పడింది. ఆయకట్టు పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు మైనర్ ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, జేఈ రామ్‌మోహన్ రెడ్డి అక్కడికి చేరుకొని జేసీబీతో మట్టి వేసి గండిని పూడ్చి వేయించారు. గండి పడిన ప్రదేశంలో కట్ట పటిష్టం చేసే పనులు చేయాల్సి ఉందని, ప్రస్తుతం తాత్కాలికంగా మరమ్మతులు చేసినట్లు వారు తెలిపారు. శాశ్వత పనులు చేసేందుకు నిధుల మంజూరు కోసం నివేదికలు పంపుతామని నిధులు మంజూరైన వెంటనే పూర్తిస్థాయిలో పనులు చేయిస్తామని అధికారులు పేర్కొన్నారు.



ఈర్ల చెరువుకు గండిపడిన దృశ్యం

కృష్ణానదిలో వరద జలాల సవ్వడి



మూర్వకొండ బురుజుల వద్ద కృష్ణా జలాలు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సమీపాన మూర్వకొండ బురుజుల వద్ద కృష్ణానదిలో వరద జలాలు సవ్వడి చేస్తున్నాయి. ఎగువన కురుస్తున్న తుపాను వర్షాలకు ఆల్మట్టి, నారాయణ్‌పూర్, జూరాల ప్రాజెక్టుల నుంచి జలాలను విడుదల చేయడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు కృష్ణానదిలో చేపలు పట్టేందుకు మత్స్యకారులు వెళ్లరాదని నది పరివాహక గ్రామాల్లో దండోరా వేయించారు. అలాగే అర్లపాడు, మూర్వకొండ ఘాట్‌ల నుంచి ఇంజిన్ బోట్లు నడుపరాదని మౌఖిక హెచ్చరికలు జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. జూరాల, హంద్రీ నీవా నుంచి దిగువన ఉండే శ్రీశైలం రిజర్వాయర్‌కు 71,544 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేయడం తెలిసిందే. నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కడంతో మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు. శ్రీశైలం రిజర్వాయర్‌కు ఆలస్యంగానైనా వరద నీరు పోటెత్తడంతో మత్స్యకార కుటుంబాల్లో సంతోషాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ముచ్చుమర్రి ఎత్తిపోతల పంప్‌హౌస్‌లో 825 అడుగుల నీటి నిల్వలు ఉన్నాయని ఏఈఈ శశికుమారి వెల్లడించారు. ఎగువ నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద జలాలు వచ్చి చేరుతున్నందున నీటి లభ్యత గంటగంటకు పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

వైభవంగా శత శంఖార్చన



మహానందిలో శత శంఖాభిషేకం పూజలు



శంఖాలను విరాళంగా ఇస్తున్న దాతలు

మహానంది: అధికశ్రావణ, దశమి శుక్రవారం సందర్భంగా మహానందిలో దక్షిణావృత శంఖార్చన పూజలు వైభవంగా జరిగాయి. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాతలు పూజలు చేయించారు. లోక కల్యాణార్థం మహానందీశ్వర స్వామికి అష్టోత్తర శత శంఖాభిషేకం నిర్వహించారు. స్థానిక అభిషేక మండపంలో పూజలు కనులపండుగగా జరిగాయి. దాతలు భవనాశి వాసు, నాగమహేష్, హైదరాబాద్‌కు చెందిన వీరేష్, అనూప్‌కుమార్ దాతలుగా వ్యవహరించారని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4 లక్షల విలువైన 120 శంఖాలు విరాళం

హైదరాబాద్‌కు చెందిన యామా వీరేష్, అనూప్‌కుమార్ దంపతులు రూ.4 లక్షల విలువైన 120 దక్షిణావృత శంఖాలను శుక్రవారం విరాళంగా అందించారు. చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి దాతలను అభినందించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి సత్కరించారు.



మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: అధిక శ్రావణ మాసం, శుక్రవారం పురస్కరించుకుని రాత్రి మహానందీశ్వర స్వామి దంపతులకు పల్లకీ సేవ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పుష్పాలతో విశేషంగా అలంకరించి పల్లకిలో కొలువుంచారు. గణపతిపూజ, అలంకార పూజ, హారతుల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ సేవ మహానందంగా సాగింది. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.